
# మల్కిభరాముడిగా కవులు ఎవరిని కీర్తించారు?

**శాతవాహనులు, కాకతీయుల అనంతరం ఆంధ్రదేశాన్నంతటినీ ఏకఛత్రాధిపత్యం కింద పాలించిన ఖ్యాతి కుతుబ్‌షాహీ వంశానికి దక్కుతుంది. ఈ వంశ పాలకులు గోల్కొండను సుమారు 175 ఏళ్లు పాలించారు. నేటి తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర నిర్మాతలు కుతుబ్‌షాహీ వంశీయులే. హైదరాబాద్‌ను ప్రపంచపటంలో సమున్నతంగా నిలిపిన చార్మినార్, హుస్సేన్ సాగర్, మక్కామసీదు లాంటివి వీరి కాలంలోనే రూపుదిద్దుకున్నాయి. గోల్కొండ నవాబులు చిత్రలేఖనం, వాస్తు, నృత్యం, సాహిత్య కళలను పోషించారు.**



జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర
ప్రత్యేకం

## కుతుబ్‌షాహీ వంశం

క్రీ.శ. 1347లో గుల్బర్గా కేంద్రంగా అల్లావుద్దీన్ హసన్‌గంగూ దక్కనులో బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఈ రాజ్యం 15వ శతాబ్దం చివరి నాటికి అయిదు స్వతంత్ర రాజ్యాలుగా చీలిపోయింది. అవి.. అహ్మద్‌నగర్, బీజాపూర్, బీరారు, బీదర్, గోల్కొండ. ఇందులో గోల్కొండను పాలించిన కుతుబ్‌షాహీలు దక్కనులో విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకున్నారు. ఈ రాజ్య వంశస్థాపకుడు సుల్తాన్ కులీ. ఈ వంశంలో గొప్పవాడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా. వంశంలో చివరివాడు అబుల్ హసన్ తానీషా.

కుతుబ్‌షాహీ వంశ పాలకులు గోల్కొండను క్రీ.శ. 1512 నుంచి 1687 వరకు సుమారు 175 ఏళ్లు పాలించారు. వీరు పారశీక ముస్లింలు. వీరి రాజ్యం 1687లో ఔరంగజేబు దాడుల వల్ల పతనమైంది. ఈ వంశంలో వరుసగా సుల్తాన్ కులీ కుతుబ్‌షా, జంషీద్, సుభాన్ కులీ, ఇబ్రహీం కుతుబ్‌షా, మహమ్మద్ కులీకుతుబ్‌షా, మహమ్మద్ కుతుబ్‌షా, అబ్దుల్లా కుతుబ్‌షా, అబుల్ హసన్ తానీషా పాలించారు.

### సుల్తాన్ కులీ కుతుబ్‌షా (1518-43)

సుల్తాన్ కులీ పారశీక (పర్షియా) దేశస్థుడు. ఇతడు 'ఖరా ఖయిన్' అనే తురుష్క తెగకు చెందినవాడు. వీరి పూర్వీకులు టర్కిస్థాన్ ప్రాంతవాసులుగా చరిత్రకారులు భావిస్తున్నారు. సుల్తాన్ అనేది రాజబిరుదు కాదు. కులీ అనే పదం తుర్కీ భాష నుంచి వచ్చింది. దీని అర్థం 'రాజ సేవకుడు' లేదా 'బానిస'. సుల్తాన్ కులీ పారశీక దేశంలోని రాజవంశంలో జన్మించాడు. ఇతడు మధ్యాసియాకు చెందిన తబ్రీజ్–హందం నగరాలను పాలించాడు. శత్రువుల చేతిలో ఓడిపోయి, ఉపాధి కోసం క్రీ.శ 15వ శతాబ్దం చివరి పాదంలో భారతదేశం వచ్చి బహమనీల ఆశ్రయం పొందాడు. ఇతడు బహమనీ సుల్తాన్ మూడో మహమ్మద్‌షా కొలువులో అంగరక్షకదళంలో స్థానం సంపాదించాడు. తన ప్రతిభతో మహమ్మద్‌షా అభిమానానికి పాత్రుడైన సుల్తాన్ కులీ దక్కన్ (తెలంగాణ) ప్రాంతానికి తరఫ్‌దార్ (గవర్నర్)గా నియమితుడయ్యాడు. మహమ్మద్ షా ఇతడిని 'కుతుబ్–ఉల్–ముల్క్', 'ఖవాస్ ఖాన్' అనే బిరుదులతో సత్కరించాడు. మహమ్మద్ షా మరణానంతరం సుల్తాన్ కులీ 1518లో గోల్కొండ రాజ్యానికి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. ఇతడు 1543 వరకు సుమారు 25 ఏళ్లపాటు ఈ ప్రాంతాన్ని పాలించాడు. రాజ్యాన్ని మచిలీపట్నం వరకు విస్తరించాడు. గోల్కొండను రాజధానిగా చేశాడు. జాతిమత భేదాలు పాటించకుండా తెలుగు సర్దార్ల సాయంతో సుల్తాన్ కులీ ఆంధ్రదేశ ఐక్యతను సాధించాడు. రాజభాష పారశీకం అయినప్పటికీ తెలుగు ద్వారానే రాజ్య వ్యవహారాలు కొనసాగించాడు. కాకతీయులు నిర్మించిన గోల్కొండ మట్టి కోటను రాతితో పటిష్టం చేశాడు. మసీదులు, రాజప్రాసాదాలు, ఉద్యానవనాలతో కోటను తీర్చిదిద్దాడు. దీనికి మహమ్మద్‌నగర్ అని పేరు పెట్టాడు. సుల్తాన్ కులీ 'షియా' మతాభిమాని అయినప్పటికీ, హిందువులకు ఉన్నత పదవులిచ్చి గౌరవించాడు. ప్రజలు అభిమానంతో ఇతడిని 'బడే మాలిక్'(దొడ్డ ప్రభువు)గా పిలిచేవారు. సుల్తాన్ కులీ 99 ఏళ్లు జీవించాడు. చివరికి తన మూడో కుమారుడైన జంషీద్ చేతిలో హత్యకు గురయ్యాడు. జంషీద్ గోల్కొండ కోట ఖిలాదార్ (కోట రక్షకుడు) మీర్ మహమ్మద్ హందానీ సహాయంతో సుల్తాన్ కులీని హత్యచేశాడు.

### జంషీద్ (1543-50)

జంషీద్ 1543లో రాజ్యానికి వచ్చాడు. ఇతడు 1550లో కేన్సర్ వ్యాధితో మరణించాడు. కేవలం ఏడేళ్లు పరిపాలించాడు. ఇతడు తండ్రిని హత్య చేసి, తన ముగ్గురు సోదరులను బంధించి రాజ్యాధికారాన్ని చేపట్టాడు. ప్రజల ఆదరాభిమానాలు పొందలేదు.

### సుభాన్ కులీ (1550)

ఇతడు 1550లో రాజ్యానికి వచ్చాడు. అదే ఏడాది రాజ్యభ్రష్టుడయ్యాడు. ఇతడు జంషీద్ కుమారుడు. తండ్రి మరణించే నాటికి ఏడేళ్ల వయస్కుడని ఫెరిస్టా రచనల ద్వారా తెలుస్తోంది. సుభాన్ పిన్న వయస్కుడు కావడం వల్ల ఇతడి తల్లి బిల్ ఖైస్ జమాన్, సయఫ్ ఖాన్ సాయంతో పరిపాలన సాగించింది. సుభాన్ కులీ ఏడు నెలలు మాత్రమే పాలించాడు. అందువల్ల కుతుబ్‌షాహీ వంశంలో ఇతడికి అంతగా గుర్తింపు లభించలేదు. చరిత్రకారులు ఇతడిని సుల్తాన్‌గా గుర్తించలేదు.

### ఇబ్రహీం కుతుబ్‌షా(1550-80)

ఇబ్రహీం కుతుబ్‌షా 1550లో రాజ్యానికి వచ్చి 30 ఏళ్లు పాలించాడు. ఇతడు కుతుబ్‌షాహీ రాజ్య స్థాపకుడైన సుల్తాన్ కులీ చిన్న కుమారుడు. ఇతడు మొదట సోదరుడు జంషీద్ దురాగతాలకు భయపడి బీదర్‌కు పారిపోయాడు. ఆ తర్వాత విజయనగర రాజైన అళియరామరాయల కొలువులో ఏడేళ్లు తలదాచుకున్నాడు. అక్కడే రాజ్యతంత్ర నైపుణ్యాలను నేర్చుకున్నాడు. ఇతడి కాలంలో గోల్కొండ రాజ్యం సుస్థిరత సాధించింది. ఇబ్రహీం కుతుబ్‌షా సమర్థుడు, పాలనా దక్షుడిగా పేరు పొందాడు. 'ఖానె ఆజమ్' బిరుదాంకితుడైన ముస్తాఫాఖాన్ ఇతడికి పీష్వాగా వ్యవహరించాడు. రాజ్యంలో బందిపోట్లను అణచివేసి వర్తక వాణిజ్యాల అభివృద్ధికి ఇబ్రహీం కుతుబ్‌షా పాటుపడ్డాడు. గోల్కొండ పాలకుడైన ఇబ్రహీం కుతుబ్‌షా, అహ్మద్‌నగర్ పాలకుడు అలీ ఆదిల్‌షా, బీదర్ పాలకుడు అలీ బరీద్‌షా ఒక సైనిక సమాఖ్యగా ఏర్పడి 1565 నాటి తళ్లికోట యుద్ధంలో విజయనగర పాలకుడైన అళియ రామరాయలను ఓడించారు. ఈ యుద్ధంలో బీరార్ నవాబు పాల్గొనలేదు.

ఇబ్రహీం కుతుబ్‌షాకు భాగీరథి అనే ప్రియురాలు ఉండేది. గోల్కొండ నగరానికి ఈమె పేరు పెట్టి 'భాగీరథీ' పట్టణంగా పిలిచారు. ఇతడి కాలంలోనే 1562లో హైదరాబాద్‌లో హజరత్ హుస్సేన్ షావలీ అనే ఇంజనీరు 18 కి.మీ. వైశాల్యంలో హుస్సేన్ సాగర్‌ను నిర్మించాడు. హుస్సేన్ షావలీకి ఇబ్రహీం తన కూతురు కైరియత్ ఉన్నిసా బేగంను ఇచ్చి వివాహం జరిపించాడు. ఉర్దూ సాహిత్యానికి 'చాజర్ ఆఫ్ ఉర్దూ (పితామహుడు)'గా ఇబ్రహీం కుతుబ్‌షాను పేర్కొంటారు. ఇతడి పాలన కాలంలోనే తొలిసారిగా గజల్స్‌ను ప్రవేశపెట్టారు. ఇబ్రహీం కుతుబ్‌షా తెలుగు కవులను, పండితులను పోషించాడు. తెలుగు కవులు వారి పద్యాల్లో ఇతడిని 'మల్కిభరాముడి'గా కీర్తించారు. ఇతడు 1580లో మరణించాడు.

### మహమ్మద్ కులీ కుతుబ్‌షా (1580-1612)

ఇబ్రహీం కులీ కుతుబ్‌షా కుమారుడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా. ఇతడు 1580లో రాజ్యానికి వచ్చాడు. 1612 వరకు 32 ఏళ్లు రాజ్య పాలన చేశాడు. కుతుబ్‌షాహీల్లో అయిదో నవాబుగా ప్రసిద్ధి చెందాడు. 15 ఏళ్ల వయసులోనే రాజ్యానికి వచ్చాడు. ఇతడి కాలంలో రాజ్యం ఉన్నత శిఖరాలను అధిరోహించింది. ఇతడు హైదరాబాద్ నగర నిర్మాతగా పేరు పొందాడు. మొగల్ చక్రవర్తి అక్బరుకు ఇతడు సమకాలీకుడు. కులీ ఆస్థానానికి అక్బర్ తన రాయబారిని పంపాడు.

మహమ్మద్ కులీ కుతుబ్‌షా తన ప్రేయసి భాగమతి పేరుపై 1591లో పారశీక వాస్తు సంప్రదాయ శైలిలో హైదరాబాద్ నగరాన్ని నిర్మించాడు. ఈమె పేరుమీదే ఈ నగరానికి భాగానగరం, భాగ్ నగర్, భాగ్యనగరం అనే పేర్లు కూడా వచ్చాయి. కులీ కుతుబ్‌షా తన ప్రేయసి భాగమతికి 'హైదర్‌మహల్' అనే బిరుదు ఇచ్చాడు. దీని ఆధారంగానే హైదరాబాద్‌కు ఆ పేరు వచ్చిందని చరిత్రకారుల అభిప్రాయం. ఇతడి కాలంలోనే చార్మినార్, చార్‌కమాన్, బాదుషాహీ అసుర్‌ఖానా, జామామసీద్, దారుల్‌షిఫా, దాద్ మహల్ లాంటి నిర్మాణాలను పారశీక–హిందూ వాస్తు రీతిలో నిర్మించారు. మహమ్మద్ కులీ కుతుబ్‌షా తొలి ఉర్దూ కవిగా గుర్తింపు పొందాడు. ఇతడి కలం పేరు 'మానిని'. ఇతడు 'కురియత్ కులీ' అనే గ్రంథాన్ని సంకలనం చేశాడు. ఇందులో ముస్లింల పండగలతో పాటు హిందువుల పండగల గురించి కూడా వర్ణించాడు. ఇతడి కాలంలోనే సారంగు తమ్మయ్య 'వైజయంతీ విలాసం', మల్లారెడ్డి 'పద్మ పురాణం', ఉర్దూ కవి వాజిహి 'లైలా–మజ్ను' గ్రంథాలను రాశారు.

### మహమ్మద్ కుతుబ్‌షా (1612-1626)

1612లో మహమ్మద్ కులీ కుతుబ్‌షా మరణించిన తర్వాత అతడి సోదరుడి కుమారుడు మహమ్మద్ కుతుబ్‌షా అధికారానికి వచ్చాడు. ఇతడు నిజాయతీపరుడు. ఇతడికి దైవభక్తి ఎక్కువ. యుద్ధాలపై ఆసక్తి చూపలేదు. మొగల్ చక్రవర్తులు ఆక్రమణలు చేయకుండా ఏటా వారికి 20 లక్షల హొన్నులు (డబ్బు) పేష్కస్‌గా చెల్లించేవాడు. ఆంగ్లేయులు తూర్పు కోస్తా తీరం వెంట వర్తక స్థావరాలు స్థాపించుకోవడానికి ఇతడు ఫర్మానాలు జారీ చేశాడు. ఇతడి కాలంలో మచిలీపట్నం, నిజాంపట్నంలో డచ్చివారు; పులికాట్, నాగపట్నంలో ఆంగ్లేయులు వర్తక కేంద్రాలను స్థాపించారు. ఇతడు 1617లో హైదరాబాద్‌లో దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదైన మక్కామసీదును నిర్మించాడు. నగర నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా ఏకైక కూతురు హయత్ బక్షీ బేగం మహమ్మద్ కుతుబ్‌షా భార్య. 1614లో పారశీక రాయబారి మీర్‌జైనుల్ అబ్దిన్ ఇతడి కాలంలో గోల్కొండను సందర్శించాడు. ఇతడి కాలంలో తూనికలు–కొలతలు మీద మీర్ మహమ్మద్ మెమిన్ 'రిసాల మిక్మరీయ' అనే గ్రంథాన్ని రచించాడు. అకాంతకీయుద్దీన్ 'కుతుబ్‌షాహి', వైద్యశాస్త్రంపై 'మిజానుల్–తచాయి' గ్రంథాలను రచించాడు. మహమ్మద్ కుతుబ్‌షా మరణించే నాటికి అతడి కుమారుడు అబ్దుల్లా కుతుబ్ పిన్న వయస్కుడు. అందువల్ల అబ్దుల్లాకు అతడి తల్లి బక్షీబేగం సంరక్షకురాలిగా వ్యవహరించింది.

### అబ్దుల్లా కుతుబ్‌షా (1626-72)

మహమ్మద్ కుతుబ్‌షా పెద్ద కుమారుడు అబ్దుల్లా కుతుబ్‌షా 1626లో రాజ్యానికి వచ్చాడు. ఇతడు 46 ఏళ్లు రాజ్య పాలన చేశాడు. ఇతడి కాలంలో మొగలులు మొదటిసారిగా 1653, 1656లో గోల్కొండపై దాడులు చేశారు.

కుతుబ్‌షాహీలు షియా ముస్లిం తెగకు చెందినవారు. మొగలులు సున్నీ తెగకు చెందినవారు. మొగలు చక్రవర్తి షాజహాన్ హైదరాబాద్ నాణేలపై సున్నీ ఖలీఫాల పేర్లు ముద్రించాలని అబ్దుల్లా కుతుబ్‌షాను ఆదేశించాడు. అబ్దుల్లా ఇరాన్‌తో స్నేహబంధాలు కొనసాగించాడు. మొగలుల ఫర్మానాలకు తలొగ్గి, చివరకు ఔరంగజేబుతో సంధి చేసుకొని అబ్దుల్లా కుతుబ్‌షా తన కుమార్తెను ఔరంగజేబు కుమారుడైన మహమ్మద్‌తో వివాహం జరిపించాడు. అబ్దుల్లా కుతుబ్‌షా 1672లో మరణించాడు.

అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో గోల్కొండ ప్రాంతంలో లభించిన ప్రపంచ ఖ్యాతిగాంచిన 'కోహినూర్ వజ్రం'ను మహమ్మద్ సయాద్ అనే అధికారి షాజహాన్‌కు సమర్పించాడు. 'మువ్వ గోపాల పదాలు' రచయిత, ప్రముఖ వాగ్గేయకారుడు క్షేత్రయ్య అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో గోల్కొండను సందర్శించి అతడితో సత్కారం పొందాడు. ఈస్టిండియా కంపెనీకి వ్యాపార హక్కుల కోసం అబ్దుల్లా కుతుబ్‌షా గోల్డెన్ ఫర్మానా జారీ చేశాడు.

### అబుల్‌హసన్ తానీషా (1672-87)

గోల్కొండ రాజ్యాన్ని 1672 నుంచి 1687 వరకు అబ్దుల్లా కుతుబ్‌షా అల్లుడు అబుల్ హసన్ తానీషా పాలించాడు. గోల్కొండ చివరి నవాబు ఇతడే. ఇతడి పాలనా కాలమంతా మొగలులు, మహారాష్ట్రులు, ఆదిల్‌షాహీలతో యుద్ధాలతోనే సరిపోయింది. గోల్కొండ రాజ్యానికి రక్షణగా ఉంటానని తానీషా నుంచి శివాజీ 20 లక్షల హొన్నులు (డబ్బు) తీసుకున్నాడు. 1677లో మొగలు, బీజాపూర్ సైన్యాలు కలిసి గోల్కొండపై దాడి చేశాయి. మొగలులతో తానీషా సంధి చేసుకున్నాడు. అక్కన్న, మాదన్న తానీషా ప్రధాన మంత్రులు. వీరి మేనల్లుడు కంచర్ల గోపన్న (రామదాసు) తానీషా కాలంలో భద్రాచలంలో దేవాలయాన్ని నిర్మించాడు, దాశరథీ శతకాన్ని రచించాడు.

అబుల్‌హసన్ తానీషా కూచిపూడి నృత్యాన్ని ప్రోత్సహించాడు. కూచిపూడి (కృష్ణా జిల్లా) గ్రామాన్ని కూచిపూడి బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇచ్చాడు. తానీషా మతగురువు షారాజు కుమారుడైన షాఅక్బర్, రంగశాయి రచించిన 'శృంగారమంజరీ' అనే అలంకారశాస్త్ర గ్రంథాన్ని సంస్కృతంలోకి అనువదించాడు. నాటి హిందువులు.. మహమ్మదీయుల అలవాట్లు, వస్త్రాలంకరణలను అలవరచుకున్నారని, అరబిక్, పర్షియన్, ఉర్దూ భాషలను నేర్చుకున్నారని ప్రముఖ చరిత్రకారుడు నేలటూరి వెంకటరమణయ్య పేర్కొన్నారు.

1687లో మొగలు చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండపై దండెత్తి అబుల్ హసన్ తానీషాను బంధించి, దౌలతాబాద్ చెరసాలలో బంధించాడు. దీంతో కుతుబ్‌షాహీ రాజ్య పాలన అంతమైంది. గోల్కొండ రాజ్యం మొగలు సామ్రాజ్యంలో విలీనమైంది.


RAILWAY RECRUITMENT BOARD
సాక్షి SAKSHI EDUCATION
RRB GROUP-D & NTPC
- Guidance
- Study Material
- Previous Papers
- Model Papers
- Practice Tests
- Mock Tests

www.sakshieducation.com